క్లుప్తంగా

సంప్రదాయాలను కాపాడాలి



సూర్యనారాయణ స్వామి దర్శనార్థం వెళ్తున్న భక్తజనం

బూర్జ: హిందువుల సంప్రదాయాలను కాపాడాలని మండలంలోని మామిడివలసకు చెందిన భక్తులు పిలుపునిచ్చారు. గ్రామం నుంచి అరసవెల్లి సూర్యనారాయణ స్వామి ఆలయా శనివారం అర్ధ రాత్రి బయలుదేరి వెళ్లారు. భక్తులకు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు కొల్లివలస జంక్షన్ వద్ద కలిసి మద్దతు తెలిపారు.

అభినందన..



సాహితిని అభినందిస్తున్న డీఈఓ తిరుమల చైతన్య

నరసన్నపేట: పదో తరగతి ఫలితాల్లో స్థానిక నారాయణ స్కూల్ విద్యార్థిని పాటోజి సాహితి 597 మార్కులు సాధించడంతో డీఈఓ సదాశివుని తిరుమల చైతన్య ఆదివారం అభినందించారు. స్థానిక కామేశ్వరినగర్‌లో ఉంటున్న సాహితి ఇంటికి వెళ్లి సత్కరించారు. 597 మార్కులు పొంది జిల్లాకు మంచి పేరు తీసుకురావడం అభినందనీయమన్నారు. సాహితి తల్లిదండ్రులను అభినందించారు. సాహితి తండ్రి తిరుమలరావు మండలంలోని కరగాం స్కూల్ హెచ్‌ఎంగా పని చేస్తున్నారు.

సనాతన ధర్మం గొప్పది



ఆధ్యాత్మిక సత్సంగంలో పాల్గొన్న వక్తలు

సారవకోట: హిందూ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని విశాఖపట్నం శివానంద ఆశ్రమానికి చెందిన విష్ణు దేవానంద స్వామి అన్నారు. బుడితి గ్రామంలో ఆధ్యాత్మిక విజ్ఞాన పీఠం, దివ్యజీవన సమాజం ఆధ్వర్యంలో ఆదివారం ఆధ్యాత్మిక సత్సంగం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో సనాతన ధర్మం గొప్పదని, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ఇతర దేశాలు గౌరవిస్తున్నాయన్నారు. యువత దేశాభివృద్ధిలో భాగం కావాలన్నారు. ప్రకాశనంద స్వామి, నికేతన్ స్వామి, రామకోటి స్వామి, గురుచరణా నంద, కృష్ణ చరణానంద స్వామి ఆధ్యాత్మిక ప్రసంగాలు చేశారు. మాతా జ్యోతిర్మయానంద భారతి తృతీయ ఆరాధనోత్సవం పురస్కరించుకుని పాదుకా పూజ నిర్వహించారు.

120 మందికి వైద్య పరీక్షలు



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సదాశివ

పాతపట్నం: మండలంలోని అంతరాబలో పాతపట్నానికి చెందిన రేగేటి షణ్ముఖరావు ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 120 మందికి డాక్టర్ జి.సదాశివ వైద్య సేవలు అందించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ప్రజలు ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలను నిర్వహించుకోవాలన్నారు. వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. భుజింగరావు, శివాజీరెడ్డి పాల్గొన్నారు.

మద్యం విక్రయాలు అడ్డగింత



మద్యం విక్రయాలను అడ్డుకుంటున్న కాలనీ వాసులు

పాతపట్నం: మండల కేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో గల మద్యం దుకాణం వద్ద ఆదివారం ఆ కాలనీకి చెందిన మహిళలు నిరసన చేపట్టారు. మద్యం అమ్మకాలను అడ్డుకున్నారు. గత నాలుగు రోజులుగా మహిళలు వివిధ రూపాల్లో నిరసనలు తెలియజేస్తున్నారు. మద్యం దుకాణం వద్ద నిరసన చేస్తున్న మహిళలపై.. ఎక్సైజ్ అధికారులు పెయిడ్ ఆర్టిస్టులు అంటూ, స్థానికేతరులంటూ వ్యాఖ్యలు చేయడంతో.. మహిళలు, కాలనీ వాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దుకాణాన్ని తరలించే వరకు నిరసనలు కొనసాగిస్తామని కాలనీ వాసులు స్పష్టం చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

హిరమండలం: ప్రైవేటు పాఠశాలల్లో అడ్మిషన్లకు పేద కుటుంబాలకు చెందిన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ కె. రాంబాబు ఆదివారం తెలిపారు. ప్రభుత్వం పేద విద్యార్థులకు ప్రతీ ప్రైవేటు పాఠశాలలో 25 శాతం సీట్లను కేటాయించిందన్నారు. పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించడమే దీని ముఖ్య ఉద్దేశమన్నారు. మే 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మండలంలో ఆరు ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయని.. అన్నిచోట్ల పేద విద్యార్థులకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు.

కాలువలు ఇలా.. చివరికి ఎలా?



తురకపేట వద్ద పిచ్చి మొక్కలతో నిండిన పిల్ల కాలువ

- పిచ్చి మొక్కలతో పూడికపోయిన కాలువలు
- పాడైన షట్టర్లు
- కాలువల తవ్వినప్పటి నుంచి అభివృద్ధి నోచుకోలేదు..
- మరో ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్నా పట్టించుకోని పాలకులు

ఎల్.ఎన్.పేట: ఖరీఫ్ సీజన్ వస్తుందంటే రైతన్నకు భయం వెంటాడుతుంది. పంట పెట్టుబడి కోసం తాహతకు మించి అప్పులు చేసి ప్రకృతిని నమ్ముకుని విత్తనాలతోపాటు పెట్టుబడి పెట్టాలి. వాతావరణ పరిస్థితులన్నీ కలిసి వస్తే పంట చేతికి అందివస్తుంది. లేదంటే పెట్టుబడి, పంట రెండూ నష్టపోవాల్సిన దుస్థితి. వర్షాలు లేనప్పుడు పంటను ఆదుకోవాల్సిన సాగునీటి వనరులైన కాలువల పరిస్థితి దయనీయంగా ఉంది. రానున్న ఖరీఫ్ వరి సాగుకు సాగునీరు ఎలా అందుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట పండాలంటే రైతుకు కావలసిన మొదటి అవసరం విత్తనం, రెండో అవసరం పంట కాలం పూర్తయ్యే వరకు సాగునీరు అందివ్వడం. అడపాదడపా కురిసిన వానలకు చెరువులు, నదులు, రిజర్వాయర్‌ల్లో నీటి నిల్వ చేసుకుని, వానలు లేని రోజుల్లో పంటలకు సాగునీరు అందివ్వాల్సిన బాధ్యత పాలకులు, అధికారులపై ఉంటుంది. పంట పొలాలకు సాగునీరు సక్రమంగా అందాలంటే కాలువలు బాగుండాలి. కాలువలు సక్రమంగా లేకపోతే సాగునీరు వృథా అవుతుంది. శివారు భూములకు చుక్క నీరు అందదు. పంటకు సాగునీరు అందించే కాలువల్లో పూడికలు తీయించడం, తూములు, మదుములు, షట్టర్లు బాగు చేయించే బాధ్యత అధికారులపైన ఉండగా.. ఇందుకు కావలసిన నిధులు సమకూర్చే బాధ్యత ప్రభుత్వంపైనే ఉంది.

ఎ'వరి'దీ పాపం..

పాలకులు కాలువ మర్మతులపై నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ రైతులకు శాపంగా మారనుంది. కాలువలను పరిశీలిస్తే సాగునీరు సక్రమంగా అందుతుందన్న నమ్మకం లేకుండా పోయింది. ఈ పాపం వరి పంటకు వెంటాడనుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలువల నిండా పిచ్చి మొక్కలు, కొన్నిచోట్ల కాలువల గట్లు బలహీనంగా ఉండటం, మరికొన్ని చోట్ల తూములు, మదుములు శిథిలమై నిరుపయోగంగా ఉన్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే కాలువల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి అవసరమైన నిధులు మంజూరు చేయించుకోవడం అధికారుల బాధ్యత కాదా? అని రైతులు ప్రశ్నిస్తున్నారు.

నీరు–చెట్టు నిధుల స్వాహా..

2014–19 మధ్య ఐదేళ్లలో మూడు సంవత్సరాల పాటు కాలువల్లో నీరు–చెట్టు పనులు చేపట్టారు. రూ.వందల కోట్లు ఖర్చుచేసినా కాలువలు మెరుగుపడలేదు. నిధులు స్వాహా చేసుకున్నారే తప్ప.. ఎలాంటి మరమ్మతులు లేకుండా పోయాయని రైతులు ఆరోపిస్తున్నారు. వంశధార కాలువలు టీడీపీ నాయకులకు కాసులు కురిపించే కల్పవృక్షాల్లా మారిపోయాయే తప్ప.. రైతులకు ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయాయి. నీరు-చెట్టు పనుల్లో భాగంగా 2016లో వంశధార కాలువల పనులు కోసం రూ.2.53 కోట్లు, 2017లో రూ.1.80 కోట్లు ఖర్చు చేశారు. కాలువల దుస్థితి ఏమాత్రం మారలేదు.

పరిస్థితి ఇలా...

ఎల్.ఎన్.పేట మండలంలోని వంశధార కుడి ప్రధాన కాలువ 4వ కిలో మీటరు వద్ద ప్రారంభమై 19వ కిలో మీటరు వద్ద ముగుస్తుంది. ప్రధాన కాలువకు అనుసంధానంగా ఏర్పాటు చేసిన పిల్ల కాలువలు పరిస్థితి మరీ దయనీయంగా ఉన్నాయి. 4ఎల్ కాలువ ఆయకట్టు 185 ఎకరాలు, 5ఎల్ కాలువ ఆయకట్టు 227 ఎకరాలు, 6 ఎల్ కాలువ ఆయకట్టు 192 ఎకరాలు, 7ఎల్ కాలువ ఆయకట్టు 287 ఎకరాలు, 8ఎల్ కాలువ ఆయకట్టు 193 ఎకరాలు, 9ఎల్ కాలువ ఆయకట్టు 156 ఎకరాలు, 10ఎల్ కాలువ ఆయకట్టు 254 ఎకరాలు, 11ఎల్ కాలువ ఆయకట్టు 893 ఎకరాలుగా ఉంది.

అధ్వానంగా కాలువలు..



కాలువలు అధ్వానంగా ఉన్నాయి. కొన్ని సంవత్సరాలుగా పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టలేదు. కాలువల్లో పిచ్చి మొక్కలు, రెల్లిగడ్డి పెరిగి సాగునీటి ప్రవాహానికి అడ్డంకిగా నిలుస్తున్నాయి. మరోవైపు కాలువల్లో పూడిక మట్టి పెరిగిపోయింది. దీంతో శివారు పంట పొలాకు సాగునీరు అందటం కష్టంగా మారుతుంది. పిల్లకాలువల గట్లు రెండు వైపులా బలహీనంగా ఉన్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే కాలువల పనులు చేపట్టాలి.

– ఎన్ వైకుంఠరావు, రైతు, మిరియాపల్లి, ఎల్.ఎన్.పేట

చుక్క నీరు రాదు



మా ఊరి వరకు వంశధార కాలువుల నిర్మాణం చేశారు. ఈ కాలువలు ఎందుకు నిర్మించారో తెలియదు. ఎప్పుడు చుక్క నీరుకూడా రాదు. నిరుపయోగంగానే ఉన్నాయి. వర్షాకాలంలో కాలువలు వరద నీటిలో కనిపించకుండా ఉంటాయి. వేసవిలో ఎందుకు పనికిరాకుండా నిరుపయోగంగా ఉంటున్నాయి. కాలువల వ్యవస్థ మెరుగుపర్చి తగిన చర్యలు తీసుకుంటేనే సాగునీటి సమస్య తీరుతుంది.

– పల్లి సంజీవ్, రైతు, దబ్బపాడు, ఎల్.ఎన్.పేట



దబ్బపాడు వద్ద శిథిలావస్థలో ఉన్న సిమెంటు పైపులు



షట్టర్ లేని వంశధార 5ఎల్ పిల్ల కాలువ

వైభవంగా తెప్పోత్సవం



హరిదాసు కొనేరులో సత్యసాయి తెప్పోత్సవం

కొత్తూరు: భగవాన్ సత్యసాయి బాబా శత జయంతి వేడుకులను స్థానిక సత్యసాయి మందిరంలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. బాబా చిత్రపటాన్ని తీరువీధి చేపట్టారు. కొత్తూరులోని హరిదాసు కోనేరులో సత్యసాయి బాబా తెప్పోత్సవం కనుల విందుగా సాగింది. వందలాది మంది ప్రజలు, భక్తులు తిలకించారు. కొత్తూరు, భామిని మండలాలతోపాటు పలు మండలాలకు చెందిన సత్యసాయి భజన మండలి ప్రతినిధులు పాల్గొని సత్యసాయి గీతాలను ఆలపించారు. ఈ సందర్భంగా 130 మంది నిరుపేదలకు అమృత కలశం పేరుతో 18 రకాల నిత్యావసరాలను పంపిణీ చేశారు. సేవా సమితి కన్వీనర్ ఎల్.భగవాన్‌నాయుడు, కోరాడ వెంకటరావు, విశ్వేశ్వరరావు, పి.అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పర్తియాత్రను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న రామచంద్రరావు

హిరమండలం: మే 4, 5, 6వ తేదీల్లో పుట్టపర్తిలో నిర్వహించనున్న పర్తియాత్రను భక్తులు విజయవంతం చేయాలని సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు అన్నారు. స్థానిక సత్యసాయిబాబా మందిర నిర్మాణాన్ని ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ జిల్లా నుంచి 4,500 మంది భక్తులు పర్తియాత్రకు వెళ్తారన్నారు. హిరమండలంలో నిర్మిస్తున్న మందిరాన్ని దసరా నాటికి పూర్తిచేయనున్నట్టు తెలిపారు. ఇందుకు సంబంధించి ప్రణాళిక సిద్ధం చేసినట్లు చెప్పారు. కొత్తూరు సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో 100 మంది నిరుపేదలకు అమృత కలశాలను పంపిణీ చేశారు. హిరమండలం సత్యసాయి సేవా సంఘం అధ్యక్షుడు అంధవరపు అబ్బాయి, కార్యదర్శి బుచ్చబ్బాయి, బాలవికాస్ రిసోర్స్‌పర్సన్ లాడి చంద్రశేఖర్, జోనల్ కన్వీనర్ చంటి మాస్టారు, సాయిబాబా, ఉన్న వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

తమ్మినేనికి అభినందన



సీతారాంను అభినందిస్తున్న శ్రీరామ్మూర్తి, నాయకులు

ఆమదాలవలస: వైఎస్సార్‌సీపీ రాజకీయ సలహా కమిటీ సభ్యుడిగా మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంను పార్టీ అధిష్టానం ఇటీవల నియమించింది. ఆయనకు వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస మండల అధ్యక్షుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ స్పీకర్ మాట్లాడుతూ కూటమి నాయకులు చేస్తున్న అరాచకాలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందజేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాగునీరు అందేనా?



ఈ చిత్రం బూర్జ మండలం గోపిదేవిపేట వద్ద ఓని గెడ్డ పిల్ల కాలువలో పెరుకుపోయిన పూడిక. మండలంలోని ఓని గెడ్డ నుంచి ఉప్పినివల గ్రామం వరకు విస్తరించి ఉన్న పిల్ల కాలువ పిచ్చిమొక్కలతో నిండిపోయింది. శివారు గ్రామాలకు తాగునీరు అందక ఆయకట్టు రైతులు ఇబ్బంది పడుతున్నారు. తుడ్డలి, మదనాపురం, గోపిదేవిపేట, అన్నంపేట, అయ్యవారిపేట, ఉప్పినివలస వరకు విస్తరించి ఉన్న ఓని గెడ్డ పిల్ల కాలువలో పూడికలు తొలగించాలని రైతులు కోరుతున్నారు.

– బూర్జ

గుంపుగా..



ఈ చిత్రం సరుబుజ్జిలి మండలంలోని రొట్టవలస వద్ద గుంపుగా సంచరిస్తున్న కుక్కలు. చిన్నారులు, వృద్ధులు, మహిళలు భయటకు రావాలంటే భయపడుతున్నారు. పశువులను కూడా గాయపరుస్తున్నాయి. ఇటీవల ఫకీర్‌సాహెబ్‌పేటలో బాలికపై కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనాలపై వస్తున్న వారిపై పాలవలస, రొట్టవలస వద్ద కుక్కలు దాడి చేస్తున్నాయి. కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

– సరుబుజ్జిలి

శిథిలావస్థలో..



సారవకోట మండలంలోని చీడిపూడి ప్రభుత్వ హోమియో వైద్యశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. కొన్ని దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ భవనం కావడంతో శిథిలావస్థకు చేరుకుని పైపెచ్చులూడుతున్నాయి. ఈ భవన నిర్మాణానికి సైతం నిధులను ప్రభుత్వాలు మంజూరు చేయకపోవడంతో అప్పట్లో ఉన్న కొంతమంది వైద్యులు సొంత నిధులు వెచ్చించి కొంత మేర మరమ్మతులు చేయించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేసి పూర్తిస్థాయి మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

– సారవకోట

పొగతో ఉక్కిరిబిక్కిరి



నరసన్నపేటకు చెందిన డంపింగ్ యార్డు వద్ద పొగతో పరిసర వాసులు నిత్యం అవస్థలు పడుతున్నారు. పక్కనే ఉన్న గ్యాస్ గొడౌన్ సిబ్బంది, వివిధ అవసరాల కోసం వచ్చే గ్యాస్ వినియోగదారులు, జగన్నాథపురం వీధి వాసులు ఈ పొగతో ఇబ్బంది పడుతున్నారు. జాతీయ రహదరిలో శ్రీకాకుళం వైపు వెళ్తున్న వాహనాదారులు పొగతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఈ పొగతో ఇబ్బంది పడుతున్నామని, వివిధ వ్యాధుల బారిన పడుతున్నామని మాజీ ఎంపీటీసీ పీస కృష్ణ అన్నారు. పంచాయతీ అధికారులు స్పందించి పొగ నిర్మూలనకు శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కోరారు.

– నరసన్నపేట

నేటి నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు

బూర్జ: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి సెలవుల సందర్భంగా ఏటా మాదిరిగానే ఈ సంవత్సరం కూడా సోమవారం నుంచి వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి ఎస్.సునీత ఆదివారం తెలిపారు. ఈ నెల 28 నుంచి జూన్ 6వ తేదీ వరకు ప్రతీరోజు ఉదయం 8 నుంచి 11 గంటల వరకు శిక్షణ శిబిరం ఉంటుందన్నారు. చిన్నారుల్లో సృజనాత్మకతను పెంపొందించడానికి ప్రత్యేకంగా వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివిధ విషయాలలో శిక్షణలు, కథలు వినటం, పుస్తక పఠనం, పుస్తక సమీక్షలు, కథలు చెప్పడం వంటివి ఉంటాయన్నారు. చిత్రలేఖనం, పేపర్ ఆర్ట్స్, స్పోర్ట్స్ అండ్ గేమ్స్ వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

హిరమండలంలో..

హిరమండలం: స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం నుంచి వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్టు గ్రంథాలయ అధికారి కె.ఎర్రమ్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆదేశాల మేరకు జూన్ 6వ తేదీ వరకు శిబిరం కొనసాగుతుందన్నారు.

వేసవి సెలవుల్లో విద్యార్థులకు పాఠకాసక్తితో పాటు పలు అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. అన్నిరకాల పోటీ పరీక్ష పుస్తకాలతోపాటు విజ్ఞానం పెంచే పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

వేసవి తరగతులతో ఉత్తమ ఫలితాలు



ఉపకరణాలను అందజేస్తున్న హెచ్‌ఎం రఘునాథరావు

జలుమూరు: పదో తరగతి విద్యార్థులకు వేసవిలో ప్రత్యేక తరగతులు నిర్వహించడం ద్వారా ఉత్తమ ఫలితాలకు దోహదపడతాయని యలమంచిలి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రఘునాథరావు అన్నారు. ఆదివారం పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు సర్పంచ్ మెండ రవికుమార్ ఉచితంగా అందించే నోట్‌బుక్స్, పెన్నులు, విద్యా సామగ్రి అందించారు. తరగతులు జూన్ ఏడు వరకు సుమారు 40 రోజులు నిర్వహించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బోరు బాగుచేయరూ..



మరమ్మతులకు గురైన బోరు

పాతపట్నం: మండల కేంద్రం పరిధి అంతరాబ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఉన్న తాగునీటి బోరు గత కొన్ని రోజుల నుంచి మరమ్మతులకు గురై నిరుపయోగంగా తయారైయింది. వేసవి కావడంతో తాగునీటి కోసం అంతరాబ గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ సిబ్బంది, సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. బోరు మరమ్మతులు చేపట్టి, పరిసరాలను పరిశుభ్రం చేయాలని కోరుతున్నారు.

అపూర్వ సమ్మేళనం



2008-09 టెన్త్ బ్యాచ్‌తో అప్పటి ఉపాధ్యాయులు

ఆమదాలవలస: పట్టణంలోని టింపని స్కూల్‌లో 2008–09 సంవత్సరానికి చెందిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. రోజంతా సందడిగా గడిపారు. అప్పటి హెచ్‌ఎం బొడ్డేపల్లి వెంకటనారాయణరావు, ఉపాధ్యాయులు వెంకటరమణ, శ్రీనివాసరావు, రవికుమార్, జయరామ్, విజయగౌరీని సన్మానించారు. పూర్వ విద్యార్థులు లోకేష్, వాసు, సావిత్రి, కమల, సంధ్య, సునీల్, సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

కిరణ స్పర్శ..



సూర్యనారాయణ స్వామి మూల విరాట్‌కు తాకిన సూర్య కిరణాలు

నరసన్నపేట: స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో స్వామి మూల విరాట్‌కు ఆదివారం ఉదయం సూర్యకిరణాలు తాకాయి. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు కృష్ణబాబు, నాని తదితరులు భక్తులతో పూజలు చేయించారు. భక్తులు కిరణ స్పర్శను తిలకించారు. స్వామివారి మూల విరాట్‌కు సూర్యకిరణాలు తాకడం గొప్ప విషయమని అర్చకులు కృష్ణబాబు తెలిపారు.

విరిగిన పైపు లైన్

- తాగునీటి సరఫరాకు అంతరాయం



ఉర్లాం సమీపంలో పైపు లైన్ విరిగిన స్థలం

నరసన్నపేట: మండలం పరిధిలోని లుకలాం తాగు నీటి స్కీమ్ ద్వారా మూడు రోజులుగా తాగునీటికి అంతరాయం ఏర్పడింది. ఉర్లాం– జల్లువానిపేటల మధ్య ఉన్న మూర్తిరాజు కాలువ వద్ద పొలంలో పైపు లైన్‌కు రంధ్రం ఏర్పడింది. లుకలాం స్కూల్ వద్ద మరో రంధ్రం ఏర్పడింది. ఉర్లాంతో పాటు గ్రామాల్లో దాహం కేకలు వినిపిస్తున్నాయి. వెంటనే మరమ్మతులు చేపట్టి తాగునీరు సరఫరా చేయాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు. లుకలాం స్కూల్ వద్ద పైపు లైన్ పనులు పూర్తి చేశారు. ఉర్లాం వద్ద పైపు లైన్ మరమ్మతులు చేయడానికి వచ్చిన సిబ్బందిని రైతు వామనమూర్తి అడ్డుపడటంతో పనుల్లో జాప్యం జరుగుతోంది. దీనిపై వామనమూర్తి మాట్లాడుతూ పైపు మరమ్మతుల పేరిట పొలం ధ్వంశం చేస్తున్నారని ఆరోపించారు. పైపు మరమ్మతు కావడంతో పొలంలోని నువ్వు పంట పాడైందన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కనకేశ్వరరావు మాట్లాడుతూ.. రైతుతో మాట్లాడామన్నారు. వెంటనే పైపు లైన్‌ను మరమ్మతులు చేసి, తాగునీటి సరఫరా పునరుద్ధరిస్తామన్నారు.

రాళ్లతో గట్టు కట్టారు



రాళ్లతో కట్టిన పొలం గట్లు

ఎల్.ఎన్.పేట: గ్రామీణ ప్రాంతాల్లో రైతులు పంట పొలాల నుంచి నీరు బయటకు వెళ్లకుండా ఉండేందుకు తమ పొలం చుట్టూ రక్షణగా ఉండేందుకు మట్టితో గట్టు కడతారు. ప్రతీ ఏడాది ఖరీఫ్ వరిసాగుకు సిద్ధమయ్యే ముందు రైతులు పొలం గట్లును బాగుచేసుకుని వ్యవసాయ పనులు చేపడతారు. కొండ ప్రాంతాల్లో ఉన్న గిరిజన రైతులు పొలాల చుట్టూ రాళ్లతో గట్లు తయారు చేసుకున్నారు. మండలంలోని కారిగూడ, మెట్టుగూడ, కొత్తజోగివలస, జోగివలస తదితర ప్రాంతాల్లో గిరిజన రైతులు రాళ్లతో కట్టిన గట్లు చూడముచ్చటగా కనిపిస్తున్నాయి.